# (అలవాటైపోతున్న)...




మండుటెండల్లోంచి వర్షాకాలంలోకి వచ్చినట్టు పల్లె నుంచి నగరానికి వచ్చారు శివుడు లక్ష్మి. ఉన్న పల్లెటూళ్లో పనికి ఎద్దడి ఎక్కువైంది. ఉన్నవాళ్ల అధికారం పెరిగింది. అన్నిరకాలుగా అక్కడ విసిగిపోయి శివుడు భార్య లక్ష్మిని తీసుకుని సిటీకి వచ్చాడు.

రైలు దిగి నాంపల్లి స్టేషన్ ఆవరణ దాటుతుంటే ఒకళ్ళిద్దరు రిక్షావాళ్ళు అడిగారు..... "ఎక్కడికి పోతావ్. ఎటుపోవాలి?" అని. ఎక్కడికెళ్ళాలో శివుడికీ తెలియదు. లక్ష్మికీ తెలియదు. అయినా ఆ క్షణాన ఆ రిక్షావాళ్ళ మాటలు వాళ్ళిద్దరికీ వినిపించలేదు.

చిన్నచిన్న తిరణాళ్ళకి వెళ్ళటమే తప్ప, ఏ తిరణాళ్ళూ లేకుండా అంతమంది జనం అటూ ఇటూ కొంప మునిగిపోయినట్టు తిరగటం అంతకుముందు ఆ మొగుడూ పెళ్ళాలు చూళ్ళేదు. ఆశ్చర్యంగా,

కంగారుగా ఆనందంగా అందరివేపూ, అన్నింటివేపూ చూస్తూ ముందుకు నడిచారు. శివుడినెత్తిన గోనె సంచీమూట లక్ష్మి చంకలో బట్టలమూట. అవే వాళ్ళు పల్లె నుంచి తెచ్చుకున్న ఆస్తి.

మరికొంచం దూరం ముందుకు నడిచి రాయల్ హోటల్ దగ్గరికి చేరాక, అక్కడ కార్లు, బస్సులు, ఆటోల హడావిడి చూసి 'హమ్మో' అనుకుంది లక్ష్మి. ఇదోరకం సముద్రం. జనం తిరిగే సముద్రం చుట్టూ చప్పుళ్ళూ, గోల, శబ్దాలు సముద్రం హోరులాగే వున్నాయి లక్ష్మికి. అన్నీ చూసి ఏం చెయ్యాలో తోచక వో అడుగు శివుడి దగ్గరకేసి తన మగాడి భుజం పట్టుకుంది.

శివుడికీ కంగారుగానే వుంది. ఇంత హడావిడిలో ఎవరూ తెలియదు. ఏమీ తెలియదు. ఏం చెయ్యాలో ఎలా బతకాలో అన్న దిగులూ వుంది. అయినా లక్ష్మి వేపు తిరిగి 'ఏం పర్లేదు లేవే' అన్నట్టు వో వెర్రి నవ్వు నవ్వాడు.

అప్రయత్నంగానే ముందుకి నడుస్తున్నారు యిద్దరూ. నగరం తన బలమైన శక్తితో ముందుకి తోస్తున్నట్టు నడుస్తున్నారు. అందరికీ తగిన అన్నిరకాల అవకాశలు వున్న అందమైన లోకం నగరం అన్న అభిప్రాయం చాలామందికున్నట్టే శివుడికీ వుంది. అదే ఆశతోటి పల్లెలో యిబ్బందుల్లో పడిన బతుక్కి యిక్కడ చల్లటి వుపశమనం దొరుకుతుందని వచ్చాడు. అలా రోడ్డు మీద నడుస్తుంటే రకరకాల పనులు కళ్ళబడ్డాయి శివుడికి. రిక్షాలు తొక్కేవాళ్ళు. బళ్ళు లాగేవాళ్ళు. రకరకాల కొట్లు..... వచ్చేపోయే లారీలు 'పర్లేదు యింత పెద్దూళ్ళో పని దొరక్కపోద్దా....' అని తనకి తనే ధైర్యం చెప్పుకున్నాడు. అదే ధైర్యంతో లక్ష్మివేపు చూశాడు. లక్ష్మి యింకా బెదురుచూపులు చూస్తూనే వుంది.

క్రితం రాత్రంతా ప్రయాణం చేశారు. సగం దూరం ఇద్దరూ మూటలు మోస్తూ రైల్లో నెలబడే గడిపారు. కంగారు తగ్గినమీదట అలసట కొద్ది కొద్దిగా తెలుస్తోంది. మరి కాస్సేపటికి ఆకలి తెలిసింది. కొంత దూరంలో ఫుట్‌పాత్ మీద వో బండి హోటల్ కనిపిస్తే యిద్దరూ ఆగారు.

"ఏం తింటావు?" అని అడిగాడు లక్ష్మిని.

"నీ యిష్టం...." అంది లక్ష్మి.

ముందు యిడ్లీ తిన్నారు. ఆకలి తీరకపోతే ఆ తర్వాత దోశ తిన్నారు. కాఫీ తాగారు. అంతా అయ్యాక....."ఎంత?" అన్నాడు శివుడు.

"నాలుగున్నర...." అన్నాడు బండి హోటల్ అతను.

"ఏంటీ.... ఎంత?" అన్నాడు శివుడు ఆశ్చర్యంగా.

బండి హోటల్ అతను విడివిడిగా రేట్లు చెప్పి, అంతా కలిపి వివరం చెప్పాడు. తమ పల్లెలోలాగే వుంటాయి రేట్లు అనుకున్న శివుడి వూహమీద, అంచనా మీద నగరపు డబ్బు జీవితం కొట్టిన మొదటి దెబ్బ అది. ఇంకేం మాట్లాడలేక డబ్బిచ్చేశాడు శివుడు.

కింద పెట్టిన మూటలందుకుని యిద్దరూ మళ్ళీ నడక మొదలెట్టారు. నగరం అందంగా వుంది. అక్కడక్కడ అయోమయంగా వుంది. 'ఒకళ్ళ వూసు యింకోళ్ళకక్కర్లేదు. కష్టపడేవాడికి బోల్డు పనులు...' ఇవీ నగరం గురించి శివుడు విన్న కబుర్లు. అందుకే ఆ రోడ్లవేపు, బిల్డింగుల వేపు, జనం కంగారువేపు ఆరాధనగా చూస్తూ ముందుకి నడుస్తున్నాడు. పల్లెల్లోలాగ ఒకళ్ళ అధికారం కింద పడి వుండక్కర్లేదిక్కడ. శివుడి పెద్ద ఆశ అది.

కాళ్ళు, చేతులూ నొప్పులుగా వున్నాయి. అందులో నెత్తి మీద మూట బరువు. 'కాస్సేపు ఎక్కడేనా

కూచోవాలి' అనుకున్నాడు. మరికొంత దూరం చాదర్‌ఘాట్ పార్క్ దాకా అలాగే నడిచారు. అందులోకి వెళ్ళచ్చోలేదోనని కాస్సేపు తటపటాయించాడు శివుడు. ఆ తర్వాత అక్కడే నిలబడ్డ వో పెద్దమనిషిని అడిగి వెళ్ళచ్చని తెలుసుకుని లోపలికెళ్ళాడు. బాగా మూలగా ఓ గుబురు పక్కన మూట దించాడు. లక్ష్మి చేతిలో మూటందుకుని "కూసో....." అన్నాడు.

మధ్యాన్నం ఆ మూలే యింత అన్నం వుడకేసుకుని తిన్నారు. అక్కడ భయపట్టానికేం లేకపోయినా లక్ష్మి ప్రతి చేష్టలోనూ బెదురు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది శివుడికి. కూచున్నప్పుడు, లేచినప్పుడు, అన్నం వండేటప్పుడు, తినేటప్పుడు.... లక్ష్మి ఆ బెదురు చూస్తుంటే తనలోకి తను చూసుకుంటున్నట్టుంది శివుడికి.

ఎంతైనా పుట్టి పెరిగిన పల్లెలో వున్నంత నిబ్బరంగా యీ కొత్తచోటు వుండదని తెలుసు. అయినా తప్పలేదు. బతుకిలా తోసుకొచ్చింది. నిబ్బరం కూడదీసుకోవాలనుకుంటున్న శివుడికి లక్ష్మి బెదురు అసహనంగా వుంది.

రెండింటి వరకూ లక్ష్మితో ఆ కబురూ ఈ కబురుతో గడిపి నెమ్మదిగా లేచాడు. 'ఎక్కడికి?' అన్నట్టు చూసింది లక్ష్మి.

"కొంచెం అటూ యిటూ వెళ్ళి ఏదేనా పని దొరుకుతుందుమో చూసొస్తా.... నే వచ్చేవరకూ ఇక్కడే కూచో...." అన్నాడు శివుడు.

"అమ్మో ఒక్కదాన్నీ కూసోనా...." అంది లక్ష్మి దెబ్బతిన్నదాన్లా చూస్తూ. మళ్ళీ లక్ష్మి కళ్ళల్లో అదే బెదురు.

శివుడికి తిక్కరేగింది. కదలకుండా అలా కూచుంటే కాళ్ళ దగ్గరికి ఏ పనీ రాదని తెలుసు. కదలాలంటే లక్ష్మి యిలా బంధాలేస్తోంది. చిరాగ్గా లక్ష్మివేపు చూశాడు. ఏ తప్పు చెయ్యకపోయినా, తప్పు చేసిందాన్లా తలొంచుకుని కూచున్న లక్ష్మిని చూడగానే శివుడి కోపం కరిగిపోయింది.

లక్ష్మి భయం అసహజమైందేం కాదు. ఊరు కొత్త. ఆ చోటు కొత్త. తనెళ్ళాక ఎవరొచ్చి ఏం అడిగినా బెదరకుండా జవాబు చెప్పే ధైర్యం లక్ష్మికి లేదు. యివన్నీ తెలుసు శివుడికి. అంతేకాదు అసలు పుట్టి పెరిగిన పల్లె వదిలొచ్చిందే లక్ష్మి కోసం. గంజి తాగి గడిపినా అష్టకష్టాలు పడ్డా తామిద్దరి బతుకూ చిందరవందర కాకుండా కలిసి గడవాలనే యిలా తెగించి వచ్చింది.

భార్య తత్వం బాగా తెలుసు శివుడికి. చిన్న మాటంటే చాలు ఎంతో బాధ పడుతుంది. చిన్న పొగడ్త చాలు పొంగిపోతుంది. మర్మం తెలియని మనసు. లక్ష్మికి తెలిసిన జీవితం చాలా చిన్నది. ఆమెకున్న కోరికలూ చిన్నవే. 'తనకి శివుడు, శివుడికి తను.... యిద్దరూ కలిసి ఏదో కష్టం చేసి కడుపుకింత తిని కలిసికట్టుగా కాలం గడిపితే చాలు.....' అంతే.

లక్ష్మి ఆ చిన్న కోరికకి అవకాశం లేకుండాపోయింది పల్లెలో వాళ్ళ బతుకు. చచ్చిపోయిన తల్లికి బదులు కామందింటికి పనికి లక్ష్మి వెళ్ళక తప్పలేదు. వెళ్ళినినాటి నుంచీ బెదురు పట్టుకుంది లక్ష్మికి. అవకాశం వున్నప్పుడల్లా కామందు సూటిగానే అడుగుతున్నాడు.

రెండుమూడు రోజులు చూసి ఆ బాధ పళ్ళేక బెదురుతూనే విషయమంతా శివుడికి చెప్పింది లక్ష్మి. కుతకుతలాడాడు శివుడు. పని మానెయ్యమన్నాడు. అంతకన్నా ఇంకేం చెయ్యటానికి తోచలేదు. లక్ష్మి పని మానేసింది. ఆ మర్నాటి నుంచీ శివుడి పాలేరు బతుకులో పని మూడింతలైంది. తిండీ

కంగారే. యింటికీ, పొలానికీ తిరుగుడూ కంగారే. నిమిషం నిలబడి అలుపు తీర్చుకునే అవకాశం లేని పరుగైపోయింది శివుడి బతుకు. ఐనా భరించాడు. ఆఖరికి కామందు నోటివెంట ఆ మాటలు విన్నాక యింక తట్టుకోలేకపోయాడు శివుడు.

ఆ మాటలు శివుడు వినాలనే అన్నాడో..... చూడకుండానే అన్నాడో.... పొలం గట్టున తీరుబడిగా స్నేహితుడితో కబుర్లాడుతూ కామందు.... "ఏంటిరా శివుడి పెళ్ళాం లక్ష్మి సంగతేనా నువ్వడిగేది. పని మానేస్తే మటుకు ఎక్కడికి పోద్దిరా.... యిప్పటికే దాని మొగుడికి తలములిగే పని తగిలించా.... యిషయం ఆడికీ తెలిసొచ్చుంటది. ఆడే తీసుకొచ్చి అప్పగిస్తాడు.... లేదూ దానమ్మ చేసిన అప్పుంది మన దగ్గర. తింటానికి తిండి గింజలు లేకుండా చేస్తే సరి..... ఆకలికి అందరూ లొంగుతారు..... అప్పటికీ కాదూ - ఏదో రాత్రి ఎత్తుకొస్తే మాత్రం ఈ వూళ్ళో మనకి ఎదురెవర్రా....." ఆ అధికారపు గొంతు అలవాటే శివుడికి. కానీ యింత అసహ్యమైన అధికారం వింటానికే దారుణంగా అనిపించింది శివుడికి.

ఆ రాత్రంతా నిద్రలేదు శివుడికి. కామందు మాటలు మరుపు రావటంలేదు. తమ బతుకుస్థాయి ఎంత అగాధంలో వుందో తెలుస్తోంది. జ్ఞానం తెలిసిన దగ్గర్నించీ కామందు దగ్గిర కష్టం చేస్తూనే వున్నాడు. ఆ అభిమానం లేదు సరికదా.... అమానుషంగా వుంది యీ అధికారం. లక్ష్మి కళ్ళల్లో బెదురు అనుక్షణం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. యజమానిని కాదని మరో కళ్ళంలో కూలి చేసుకుని బతికే అవకాశం లేదు. ఊళ్ళో ఆయన పలుకుబడి, శక్తి అలాంటిది. బాగా ఆలోచించిన మీదట నగరం తప్ప మరో ఆధారం కనిపించలేదు శివుడికి. లక్ష్మితో చెపితే సరేనంది. ఇద్దరిదీ ఒకటే ఆశ మరో యింత కష్టం చేసినా నగరంలో అయితే తమ బతుకు తాము బతకొచ్చని. పల్లె కదిలి వస్తుంటే బాధనిపించింది శివుడికి. కామందు ఏదో చేస్తాడన్న భయంకన్నా లక్ష్మి బెదురు చూపులే శివుణ్ణి ఆ పల్లె నుంచి కదిపాయి. పరిస్థితి ఎలాంటిదేనా లక్ష్మి వొంటి మీద మరో మగాడి చెయ్యి అన్నది వూహలోనైనా శివుడు భరించలేదు.

లక్ష్మి కళ్ళల్లో ఇదివరకటి బెదురు వేరు. యీ బెదురు వేరు. రెండింటికి చాలా తేడా వుందనిపించింది శివుడికి. 'ఏదేనా పనిలో స్థిరపడి నిలదొక్కుకుంటే ఏ దిగులూ వుండదు. అప్పటిదాకా తనే కొంచం ఓర్పుగా వుండాలి....' అనుకున్నాడు శివుడు.

'సర్లే అయితే నువ్వూరా.... యిద్దరం కలిసే తిరుగుదాం..." అన్నాడు. ఆ మాటతో యింత ముఖం చేసుకుని హుషారుగా లేచింది లక్ష్మి.

★ ★ ★

ఓపిగ్గా చాలాసేపు తిరిగారు యిద్దరూ. అలా తిరగటంలో గంటలు గంటలు గడిచాయి తప్ప పని దొరకలేదు. చాలా కొట్లలో, ఆఫీసుల్లో పని అడిగారు. లాభం లేకపోయింది. ఇంక ఆఖరికి రాత్రి పది దాటాక కాళ్ళీడ్చుకుంటూ పార్క్ చేరారు. ఊర్నించి తెచ్చుకున్న గింజలు ఆ రాత్రి వండుకు తినేస్తే అయిపోతాయి.

అలిసిన వొళ్ళు, బరువెక్కిన మనసు.... ఆకలి.... పార్క్ లోపలికి వెళ్ళి, మధ్యాన్నం కూచున్న మూలకే చేరారు. మూటిప్పి గిన్నెలు తీసి వంట ప్రయత్నంలోకి దిగింది లక్ష్మి.

"ఎవరు మీరు... లెండి.... లెండి యిది వొండుకు తిని పడుకునే సత్రం కాదు.... పార్క్" అంటూ వచ్చాడు చౌకీదారు. ఆ రాత్రివేళ యీ లేనిపోని సమస్య మరింత కుంగదీసింది శివుణ్ణి.

"బాబ్బాబు.... మాదీ వూరు కాదు. పని వెతుక్కుంటూ చాలా దూరంనుంచొచ్చాం.... మీరు

వొద్దంటే వంట మానేస్తాం.... యీ రాత్రి కుండి పొద్దున్నే ఎల్లిపోతాం..." అన్నాడు శివుడు బతిమాలుతూ.

"వొండుకు తినకపోయినా.... రాత్రి పూట యిక్కడ వుండకూడదు.... నేనొదిల్నా పోలీసులు వొదలరు...." అన్నాడు చౌకీదారు.

మరికాస్సేపు బ్రతిమాలాడు శివుడు. అయినా లాభం లేకపోయింది.

"యీ రాత్రిపూట, ఆడదాన్ని తీసుకుని ఎక్కడికి పోను బాబూ...." అన్నాడు చివరికి శివుడు.

జాలేసి చౌకీదారే ఆ సమస్యకి దారి చూపించాడు.

"ఇదిగో ఇలా ముందుకెళ్ళి అటు పక్కకి తిరగండి.... టెలివిజన్ కేఫనే హోటలుంది. ఇంకొంచం ముందుకి పోతే కుడిచేతేపు వరసగా మూసేసిన షాపులుంటాయి. వాటి ముందు వరండాలా చోటుంది. మీలాంటోళ్ళు చాలామంది పడుకునుంటారు అక్కడ. మీరూ వెళ్ళి అక్కడే సర్దుకోండి...." అన్నాడు.

చౌకీదార్ చెప్పినచోటు తేలిగ్గానే దొరికింది. అప్పటికే చాలామంది పడుకున్నారు. వీధిలైటుకి దగ్గరగా వున్నచోట నలుగుర్లైదుగురు మగాళ్లు పులి-మేక ఆడుతున్నారు. కొంతమంది తిండి తింటున్నారు. కొంతమంది కబుర్లు చెప్పుకుంటున్నారు. ఒకచోట కొంచెం ఖాళీ కనిపిస్తే లక్ష్మితో సహా అక్కడ కూలబడ్డాడు శివుడు. ఆ రాత్రికి చోటు సమస్య తీరినందుకు తేలిగ్గా నిట్టూర్చాడు.

నేలంతా ధుమ్ము. చీదరచీదరగా వుంది. దులుపుకునే అవకాశం లేదు.

చుట్టూ జనం, ఆడా, మగా, పిల్లలు ఏడుపులు.... గోలగోలగా వుంది.

అదొక్కటే కాదు, నగరంలో ఆలాంటిచోట్లు చాలా వున్నాయి. తేడా అల్లా రూపంలోనే. కొన్నిచోట్ల పెద్దసైజు అరుగులు, మరికొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లు.... ఖాళీస్థలాలు... వాటి ఆసరాగా రాత్రిళ్ళు జీవితం గడిపే వేలకొద్దీ జనం.

తలదాచుకునే నీడలేని రకరకాల జనం. ముష్టాళ్ళు, కుంటాళ్ళు, గుడ్డాళ్ళు..... రోజు కూలీవాళ్ళు.... జేబులు కొట్టేవాళ్ళు.... రకరకాలు.... అయినా అక్కడ అందరి సమస్యా ఒక్కటే. చిన్న పాకేనా సరే అద్దెకి తీసుకుని బతకలేని ఆర్థిక దౌర్భాగ్యం. అంతకు ముందటిరోజు వరకూ వ్యవసాయ కూలీగా చిన్న పాక నీడన బతికిన శివుడు - ఆ రాత్రి భార్యతో చేరి ఫుట్‌పాత్ మనిషిగా మారాడు.

చుట్టూ వాతావరణం చూసి.... "ఇప్పుడిక్కడ ఏం వండుతావులే...." అన్నాడు లక్ష్మితో.

"మరి ఆకలేయటంలా...." అంది లక్ష్మి.

"ఎదురుగా హోటలు తెరిచే వుంది. వెళ్ళి ఏదేనా తెచ్చుకుంటే" అనుకున్నాడు. పొద్దుటి బండి హోటల్ గుర్తొచ్చింది. అక్కడే అంతైంది. యిది కుర్చీలు, బల్లలూ, అద్దాలు వున్న హోటల్.... యింకెంతవుతుందో.... అదీగాక అంత డబ్బూ లేదు. వున్నదంతా రెండు రూపాయల్లోపే.... ఎప్పుడే అవసరం వస్తుందో! అదీ ఖర్చు చేసేస్తే ఎలా...."

శివుడి ఆలోచన కనిపెట్టింది లక్ష్మి. "యిప్పుడెళ్ళి ఏం తేవొద్దులే - మధ్యాన్నం తినగా మిగిలిన అన్నం వుంది కొంచం..... అది సర్దుకు తినేద్దాం...." అంది ఆ పనే చేశారు. మరో అరగంటకి దుప్పటి గుడ్డ పరుచుకుని పక్కపక్కనే పడుకున్నారు.

అనుక్షణం జరుగుతున్నది తెలుస్తూనే వున్నా, ఏమిటో అయోమయం. అల్లిబిల్లి వూహల మధ్య శివుడికి కన్ను మూతపడింది. జాగ్రత్తకోసం మూట బాగా ఎత్తుగా వున్నా తలదానిమీదే పెట్టుకున్నాడు. అలిసిన వాళ్ళు నిద్రలో కూరుకుపోటానికి ఎంతోసేపు పట్టలేదు. అంతకుముందే నిద్రలోకి జారుకుంది

లక్ష్మి. అది వూరైనా, నగరమైనా, పార్కైనా, రోడ్డయినా పక్కన శివుడున్నాడు. అంతే, అదే ధైర్యం లక్ష్మికి.

వో రాత్రివేళ పక్కన పడుకున్న మనిషి కదలికకి కాళ్ళ తాపులకి హఠాత్తుగా మెలుకువొచ్చింది శివుడికి. కాస్సేపటికి కానీ పడుకున్న కొత్త చోటు గుర్తుగా తెలియలేదు. తెలిశాక లక్ష్మి పడుకున్నవేపు తలతిప్పి చూశాడు. చూసీచూడగానే వులిక్కిపడి లేచాడు. కళ్ళు నులుముకుని మరీ చూశాడు.

శివుడు పడుకున్న వేపుకే తిరిగి పడుకునుంది లక్ష్మి. వొళ్ళెరక్కుండా నిద్రపోతోంది. కానీ లక్ష్మి నడుం చుట్టూ ఎవర్దో మగాడి చెయ్యి. లక్ష్మి కాళ్ళ మీద అతని కాళ్ళు.

"తన లక్ష్మిమీద మరో మగాడి చెయ్యి...." నిద్ర మత్తంతా వొదిలిపోయింది శివుడికి. గబుక్కుని లేచి వెళ్ళి లక్ష్మి నడుం మీదున్న చేతిని తీసేసి, ఆ మనిషి వీపుమీద ఛళ్ళుమని వో చరుపు చరిచాడు.

ఒక్కసారిగా అంత దెబ్బ తగలటంతో వులిక్కిపడి లేచాడు ఆ మనిషి. లేచి "ఏమిటి..... ఏమిటి?" అన్నాడు.

"పక్కన ఆడ మనిషుంటే ఆలా పడుకుంటావా.... మనిషివా..... పశువ్వా" అన్నాడు శివుడు కోపంగా.

ఆ మనిషి అయోమయంగా చూస్తూ "ఆడమనిషా..... ఏ ఆడమనిషి...." అన్నాడు.

"ఇంకెవరు.... నా భార్య..... వొళ్ళు దగ్గరెట్టుకొని పడుకో...." అన్నాడు శివుడు లక్ష్మివేపు చూపిస్తూ....

విషయంతోపాటు, వీపు మీద చుర్రుమంటున్న దెబ్బకూడా అర్థమైంది ఆ మనిషికి.

"చాలుచాల్లే.... నువ్వే వొళ్లు దగ్గరెట్టుకో ఇది నీ యిల్లేం కాదు.... అందరూ నువ్వు చెప్పినట్టుండటానికి. నీ కంత అనుమానమైతే రాత్రంతా కూచుని నీ పెళ్ళానికి కాపలా కాసుకో" అని అటు తిరిగి పడుకొన్నాడు.

'ఇంత పొగరుగా మాట్లాడుతున్నాడు. వీడు కావాలనే లక్ష్మి మీద చెయ్యేసి వుంటాడు...." అనుకున్నాడు శివుడు. రెండోవేపు చూశాడు తనకి యిటువేపు మగమనిషే పైగా కాళ్ళతో కుమ్మేస్తున్నాడు. ఇటువేపు లక్ష్మిని పడుకోమంటానికి అసలు వీలులేదు" ఇంక ఆ రాత్రికి నిద్రపోలేదు శివుడు.

రాత్రంతా లక్ష్మిని చూస్తూ అలా జాగారం చెయ్యటంతో పొద్దున్నకి నీరసం, విసుగు, చిరాకు అన్నీ కలిసి శివుణ్ని కమ్ముకున్నాయి. వూరు విడిచి పెట్టి రావాల్సి రావటం, సొంతంగా దున్నుకు బతకటానికి కనీసం అర ఎకరం నేలేనా లేని వ్యవసాయదారుడి మానసిక వుక్రోషం, అలవాటుపడలేని ఆ ఫుట్‌పాత్ పక్కన బతుకు, ఏ ఆధారం కనిపించని అయోమయం.... మొత్తానికి నీరసంగా నిస్సత్తువుగానే సూర్యోదయం చూశాడు శివుడు.

గుడ్డి కన్నా మెల్ల నయం అన్నట్టు, నిరుత్సాహంగా వున్న శివుణ్ని ఒకళ్ళిద్దరు పలకరించారు. విషయం తెలిసి వాళ్ళల్లో ఒకడు అన్నాడు. "జల్దీ ముఖం కడుక్కుని యింతేదేనా తిని రడీగుండండి.... యిది పని అడ్డా ఎవరేనా పిలిస్తే కూలికిపోదురుగాని...." అన్నాడు. శివుడికి ఆ మాటలు ముందు అర్థం కాలేదు. మరి కాస్త వివరంగా చెప్పాక అర్థమై అలాగే అన్నట్టు తలూపాడు.

శివుణ్ని ఎవరూ ఏ పనికీ పిలవలేదు. తెలిసున్న వాళ్ళు తెలిసిన ముఖాల్ని గుర్తుపట్టి తీసికెళ్ళారు. ఏం చెయ్యటానికీ తోచక దిక్కులు చూస్తూ అలాగే నిలబడ్డాడు.

ఎనిమిదిన్నరకి మస్తాన్ వచ్చాడు. శివుణ్ని, శివుడు దిక్కులు చూట్టాన్ని పసిగట్టి దగ్గరకొచ్చాడు. వొచ్చి.... "పనికోసమా...." అనడిగాడు.

శివుడు అవునన్నట్టు తలూపాడు. మస్తాన్ ఒకటిరెండు ప్రశ్నలడిగాడు. ఏవూరో, ఎప్పుడొచ్చారో వివరాలు తెలుసుకున్నాడు. తర్వాత తనెవరో, తన పద్ధతేమిటో చెప్పాడు. శివుడు సరే అన్నాడు.

పని వున్న రోజుల్లో పని యిప్పిస్తాడు మస్తాను. అతని వృత్తి అది. కొత్త కూలోళ్ళకి కూలి యిప్పిస్తాడు. వచ్చిన కూలీలో నాలుగోవంతు అతని కమీషన్ శివుడికీ అదే చెప్పాడు.

"రోజుకి అయిదు రూపాయిల్నించి పదిదాకా వుంటుంది కూలీ. ఎంతైతే అంత అందులో నాలుగోవంతు నాది"

ఆరోజుకి ఓ గోడవును దగ్గిర లారీకి సరుకు ఎక్కించేపని యిప్పించాడు మస్తాన్. నగరానికి కొత్తగా పొట్ట కూడు వెతుక్కుంటూ వచ్చేవాళ్ళకి లోటు లేదు. వాళ్ళకి పని అవసరం. వాళ్లు మస్తాన్‌కి అవసరం. ఆ రోజంతా కష్టపడితే ఆరు రూపాయలొచ్చాయి.

శివుడికి అదే బ్రహ్మానందమనిపించింది. నగర జీవితపు తొలిమెట్టు ఎక్కినట్టైంది. పని చేస్తున్నంతసేపు రాత్రి పడక గురించి ఆలోచన సాగుతూనే వుంది శివుడికి. సాయంత్రానికి మస్తాన్ కమీషన్ పోను కూలి డబ్బులు చేతికొచ్చాయి. పొద్దున్నకన్నా ధైర్యం వచ్చింది చిన్న హోటల్‌కి వెళ్ళి లక్ష్మి, శివుడు యిద్దరూ అన్నం తిన్నారు. తిన్నాక తలదాచుకునే చోటు వెతుక్కుంటూ బైలుదేరారు. మరొకళ్ళ గొడవ లేకుండా వుండే చోటు కోసం వెతుకుతున్నాడు శివుడు. ఓ చిన్న అరుగు కనిపించగానే 'హమ్మయ్య.....' అనుకున్నాడు.

శివుడు, లక్ష్మి ఆ అరుగుమీద పడుకున్న అరగంట గడవక ముందే పోలీసులొచ్చి వెళ్ళగొట్టారు. మరోచోటుకి మారారు. అక్కడ వూరకుక్కల బాధ.... మరోచోట తాగుబోతుల అల్లరి.... మొత్తానికి నాలుగైదు చోట్లు మారాక శివుడికి ఆ నగరంలో రాత్రిళ్ళు నలుగురూ వున్నచోట గడపడమే మంచిదని పించింది. ఆ రాత్రి శివుడితోపాటు లక్ష్మికీ నిద్ర కరవైంది.

మర్నాడూ మస్తాన్ పని యిప్పించాడు శివుడికి. కూలి మామూలుగానే చేతికందింది. నిన్నటిలాగే ఖర్చయిపోయింది. కూలి తిండికే సరిపోతోంది. గూడుకోసం ఆలోచించగలిగినంత ఆదాయం రావటంలేదు.

ఆ రాత్రీ ఆశ చావక అక్కడా యిక్కడా నిద్రపోయే ప్రయత్నం చేశాడు. కుదరలేదు. ఒంటరిస్థలాల్లో పోలీసులు చూస్తే వుండనివ్వరు. వెళ్ళి నలుగురూ వున్న చోట పడుకోమంటున్నారు. నలుగురూ వున్నచోట, లక్ష్మిని మరో మగాడి పక్కన పడుకో పెట్టటానికి శివుడికి మనసు వొప్పటంలేదు.

సరైన నిద్రలేదు. సరైన తిండి లేదు. అలవాటులేని కొత్తరకం కూలిపనులు. మూడోనాటికి వొంట్లో వోపికంతా హరించుకుపోయినట్టయింది శివుడికి. ఆ రాత్రి యింక తప్పనిసరై మళ్ళీ పడక్కి పాతచోటుకే చేరాడు. కాస్త వోపిగ్గా వెతికి వో లంబాడి ఆడమనిషి పక్కన లక్ష్మికి పక్కేసి ఆ పక్కన తను పడుకున్నాడు. ఓ రాత్రివేళ ఆ లంబాడీ ఆడమనిషి లేచి ఎటో వెళ్ళిపోయింది. మళ్ళీ లక్ష్మి పక్కన ఎవరో మగమనిషి.

నిద్రలేచిన శివుడికి లక్ష్మికి అటుపక్కన ఎవరో మగమనిషి వుండటం కళ్ళబడింది. మెళకువగా కూచోవాలని లేచి కూచున్నాడు. పట్టుమని పది నిమిషాలు కూడా అలా కూచోలేకపోయాడు. నీరసం, నిరుత్సాహం నిండిన వొళ్ళు, అలసట, సరైన తిండిలేని మూడురోజుల శ్రమ నిద్రలేమి.... అన్నీ కలిసి శివుడ్ని లొంగదీసాయి. తనకి తెలియకుండానే శివుడు నిద్రలోకి వొరిగిపోయాడు. శివుడి మనసులో జరుగుతున్న ఈ అంతర్యుద్ధం తెలియని లక్ష్మి వొళ్ళెరక్కుండా నిద్రపోతోంది.

రోజులు గడుస్తున్నాయి. శివుడు మస్తాన్ సాయంతోటి, సాయం లేకుండా కూలికి వెడుతూనే వున్నాడు. నెలతిరిగే లోపల శివుడికి నగరం తాలూకు చాలా విషయాలు అర్థమయ్యాయి. తన పద్ధతులు కొన్ని మార్చుకుంటే తప్ప ఇక్కడ బతకటం కష్టం అనీ, అందరిలాగే తనూ అలవాటు పడక తప్పదనీ అనుకున్నాడు.

కొన్ని కొత్త అలవాట్లు చేసుకున్నాడు. వాటిల్లో టీ తాగటం వొకటి. నీరసాన్ని తాత్కాలికంగా చంపే టానిక్. ఆకలికి అడ్డుగా బన్‌లు, రొట్టెలు ఎక్కడపడితే అక్కడ తింటం మరో అలవాటు. లక్ష్మిని కూడా కూలికి పంపటం మూడో అలవాటు.

నగరంలో తమలాంటి దినసరి కూలాళ్ళ సంపాదనలో సఖం టీలకి సఖం తిండికీ సరిపోతుందన్న నిజం తెలిసొచ్చాక శివుడికి తాపత్రయం సఖం తగ్గింది. రోజు గడుస్తోంది చాలన్న ధోరణి అలవాటైంది.

యీ బతుకుతో..... యీ సంపాదనతో తనూ లక్ష్మి ఏ కుళ్లు కాలవ పక్కనేనాసరే వో పాక అద్దెకి తీసుకోటం కూడా తేలిక కాదని అర్థమైంది.

ఇప్పుడు యిక్కడా, అక్కడా అని లేదు. ఎక్కడపడితే అక్కడ, ఎవరి పక్కన పడితే వాళ్ళ పక్కన నిద్రపడుతోంది. లక్ష్మి పక్కన మగమనిషి పడుకున్నా, ఆడమనిషి పడుకున్నా పట్టించుకోటం మానేశాడు. అప్పుడప్పుడు నిద్రపోతున్న లక్ష్మి మీద ఆ మనిషీ యీ మనిషీ కాలూ చెయ్యీ పడ్డా యిదివరకటిలా చూట్టంలేదు.

నగరం పెరుగుతూనే వుంది. రోజుకి పదుల సంఖ్యలో, నెలకి వందల్లో, యాడాదికి వేలల్లో. పల్లెల నుంచి వలస వచ్చేవాళ్ళని నగరం తన విశాలమైన వడిలోకి చేర్చుకుంటూనే వుంది. రోడ్డు పక్క అరుగులు, మూసేసిన కొట్ల ముందు వరండాలు, పుట్‌పాత్‌లూ రాత్రిళ్ళు మరీ మరీ ఇరుగ్గా మారిపోతూనే వున్నాయి.

“భార్యా, భర్తా.... ఒకిరికి ఒకరు.... యిద్దరికీ చిన్న గూడు....” అని ఆశ పడే లక్ష్మి శివుడు లాంటివాళ్ళకి వాటిని మర్చిపోయి బతకటం అలవాటైపోతూనే వుంది.

పక్కవాళ్ళు చూస్తున్నా, తప్పనిసరై సాగించే దుప్పటీ ముసుగు సంసారం, పావలా, అర్థకీ కూడా వొంటి వ్యాపారం.... యిలా.... యిలా.... యింకా చాలా దారుణాలు అలవాటైపోతున్నాయి. అన్నింటికన్నా దారుణంగా, మనిషికి మరో మనిషి అన్న మనసులోని సహజమైన మృదుత్వం రోజురోజుకీ చచ్చిపోటం, చంపటం, చంపుకోటం కూడా అలవాటైపోతోంది.

• *స్వాతి మాసపత్రిక, ఆగస్టు, 1982*